
ఈ వారం శృంగార

# ఫస్ట్ నైట్

- మహర్షి



సమయం పదిన్నరదాటి అరగంటయింది.

గోవిందరావు ఆఫీసుకు రావడం ఆలస్యం కావడంతో చెమటలు కక్కుకుంటూ ఎండలో నుండి గబగబా లోపలకు అడుగుపెట్టబోతూ గడప తగిలి బోర్లా పడబోయి తమాయించుకున్నాడు. తనని ఎవరూ గమనించలేదని నిర్ధారించుకుని మెల్లగా లోపలకు దారితీశాడు. అతను అలా నటించడం ఓ జతకళ్ళు గమనించనే గమనించాయి.

అతను దగ్గరవడంతో "హడావిడి పెళ్ళికొడుకు పెళ్ళానికి బదులు పేరంటాల్ని శోభనపు గదిలోనికి లాక్కెళ్ళాడట (జోక్) అన్నది సుందరి చేస్తున్న పనిని ఆపి గోవిందరావు వైపు ఒళ్ళు విరుచుకుంటూ చూస్తూ.

ప్రక్కసీటు మాల పైటచెంగు అడ్డుపెట్టుకుని కిసుక్కున నవ్వింది. గోవిందరావు గుండె కలుక్కుమన్నది. ఛీ... వెధవ అలవాటు ఎంత నిదానంగా నడుచుకోవాలన్నా అలవాటుకాదు. విసుక్కుంటూ వెళుతుంటే "గురుడు ఇంకా రాలేదు. సంతకం పెట్టు" అన్నాడు కోలిగ్ కుమార్. అమ్మయ్య అనుకుని సంతకం చేసి వెళ్ళి సీట్‌లో రిలాక్స్ అయ్యాడు.

"త్వరగా పెళ్ళి చేసుకోరా నీకు పెళ్ళాం వస్తుంది, నాకు కోడలు వస్తుందని చెవిలో ఇల్లు కట్టుకుని అరచినా నా మాట వినవుకదా! పోనీ, ఎవరినైనా ప్రేమించావా? అదైనా చెబితే నా గుండెలమీద బరువు దిగుతుంది."

ఆ గొంతు గోవిందరావు తల్లిది. ఉలిక్కిపడి భయంగా చుట్టూచూశాడు. తను పెళ్ళి చేసుకోవడం లేదని ఆఫీసులో అందరికీ చెప్పి పెళ్ళికి ఒప్పించమని చెప్పటానికి వచ్చిందేమోనని. తల్లి మాత్రం కనబడలేదు కాని, అందరూ గోవిందరావు పిచ్చివాడిని చూసినట్లు చూస్తున్నారు. ప్రతిరోజు ఇంటికి వెళ్ళగానే వాళ్ళమ్మ మాట్లాడే మాటలు చేసే గొడవ అతని మెదడును తొలుస్తుంటాయి. అంతకుముందు అతనికి వినబడిన మాటలు ఆ బాపతే మరి!

"ఈ గోవిందరావుకు యింత వయసు వచ్చినా పెళ్ళిచేసుకోడేమిటే?" మాల ప్రశ్నగా అడిగింది.

"బెండకాయ ముదిరినా, బ్రహ్మచారి ముదిరినా పనికిరాదంటారు కదా! ఒక వేళ బెండకాయ ముదిరిందేమో!" పళ్ళతో పెదాల్ని కొరుకుతూ చెప్పింది సుందరి.

"ఛీ... మరీ బరితెగించి మాట్లాడకు. అతను ఎలా ఫీలవుతాడు" మాల చిరుకోపం.

"అంత రోషమున్నవాడు త్వరగా పెళ్ళిచేసుకోవచ్చు కదా!" సాగదీసింది సుందరి. ఆ మాటలు చిన్నగా గోవిందరావుకు వినబడుతూనే వున్నాయి.

అది నగరంలో ఓ అందమైన పార్కు. సాయంత్రం ఎండలో ఎంతోమంది స్నానం చేస్తున్నారు. నీటి కొలను నుండి వచ్చే చల్లని గాలి మనసునిండా చిలిపి కోరికల్ని రేపుతోంది. జంటలు జంటలుగా పార్కులోనికి వస్తున్నారు. గోవిందరావు కొలను ఒడ్డునున్న కొబ్బరి చెట్టు క్రిందనున్న బెంచీమీద ఒంటరిగా కూర్చుని బారులు బారులుగా వెళుతున్న పక్షుల సముదాయాన్ని గమనిస్తూ మైమరచి పోతున్నారు. చుట్టూవున్న లోకాన్ని మరిచాడు. చెట్టాపట్టాలేసుకుని, ఆనందం ఆస్వాదిస్తున్న ఆ జంటలు కనిపించడంలేదు. పిల్లలు కేరింతలు అసలు వినిపించడం లేదు. ప్రకృతిని చూసి ఆనందించగలడు కాని, ప్రక్కనున్న పడుచును పలుకరించలేని పిరికివాడు. తల్లిచాటున పెరిగినవాడు. పరాయి ఆడవారితో మాట్లాడాలంటే భయం. అంతకాలంగా ఆఫీసులో పనిచేస్తున్నాడన్న మాటేకాని అందరితో కలిసిమెలిసి వుండే మాల, సుందరితో వోరారా మాట్లాడలేదు. వాళ్ళు రంగంలో దింపాలని ప్రయత్నించి విసుగుచెంది అప్పుడప్పుడు ఏడిపిస్తుంటారు. అందుకే వారికి దూరంగా వుంటాడు. చీకటిపడితే పొదల చాటుకి వెళ్ళాలని ఆరాటపడే జంటల ఆతృతను అతను గమనించలేదు మరి!

అతని ప్రకృతి ఆరాధనను భంగపరుస్తూ ఓ కోకిల కంఠం పలుకరించేటప్పటికి ఉలిక్కిపడి అటు చూశాడు. అతనికి తెలియని ఓ అందమైన యువతి అతన్నే గమనిస్తున్నది. అదే కాకుండా చాల దగ్గరగా వచ్చి నిలబడి వుంది. ఆమె ఒంటినుండి వచ్చే సెంట్ స్మెల్‌కు ఎక్కడలేని మత్తు కలిగింది. వాళ్ళకు దగ్గరలో ఎవరూ లేరు. గోవిందరావు గుండె వేగం పెరిగి చల్లని వాతావరణం కూడా చిరుచెమట్లు పట్టాయి. అతనికి తెలియకుండా మనసుకు ఏదో తెలియని ఆనందం అనిపించింది. పెళ్ళి చేసుకుంటే యిలాంటి అమ్మాయిని చేసుకోవాలి అనుకునేటప్పటికి ఒళ్ళు ఝల్లుమన్నది.

ఆమె కంఠంలో ఏదో ఆకర్షణ వుంది. ఆ ఆకర్షణ ప్రవాహంలో కొట్టుకుపోతూ చేయి చూపించాడు టైమ్ చూసుకోమన్నట్లు. ఆమె కిలకిలా నవ్వింది. అతని గుండె వేగం మరింత పెరిగింది.

"నేను మీ ప్రక్కన కూర్చో వచ్చా" అంటూ అతను సమాధానం యివ్వకముందే అంటీ అంటకుండా కూర్చుంది. అతని మనసు గాలిలో గంతులేస్తోంది. ఆ పరిసరాలనే మరిచి ఒళ్ళు తిమ్మిరెక్కగా, ఏమి జరుగుతుందో తెలియకుండా వున్నాడు. పక్షులు గూటికి చేరి గోలగోల చేస్తున్నాయి. పూర్తిగా చీకటిపడిపోయింది.

అతనిలో చలనం లేదు. ఆమె కొంత చొరవ తీసుకుని కొంచెం దగ్గరకు జరిగింది. ఒకరి శరీరం ఒకరికి తగులుతుంది.




ఆమె అంత ఫ్రీగా దగ్గరగా అవుతుందని వూహించని గోవిందరావుకు కొంచెం ధైర్యం వచ్చింది. మనసు తీయగా మూలిగింది. ఒంటరిగా ముక్కు, మొహం తెలియని ఓ అమ్మాయి పార్కులో ప్రక్కన చేరి ఏమైనా చేయమని అడుగుతున్నట్లుగా గోవిందరావుకు. చుట్టూ జనం వున్నారన్న మాట మరిచాడు. ఆమెను ఏదో చేయాలని కోరికవున్నా ఏమిచేయాలో తెలియడం

లేదు. ఆమె అంగీకరిస్తుందో లేదో అని ఆలోచించలేదు. అసలామె ఎవరు అని కూడా ఆలోచించలేదంటే మన గోవిందరావ్ ఎలాంటి మూడ్‌లో వున్నాడో ఆలోచించండి మీరైనా!

"నేను మిమ్మల్ని నెలరోజులుగా గమనిస్తున్నాను. ఇక్కడే ఈ బెంచీమీదే ఎవరికోసం ఈ తపస్సు. మీ అందం నన్ను నిద్రపోనీయడం లేదు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానని, నా మనసు మీ నుండి మరలించుకోలేనని ధైర్యం చేసి అడుగుతున్నాను. నన్ను మీరు పెళ్ళి చేసుకుంటారా? మీకు కృతజ్ఞురాలినై జీవితాంతం కలిసి కాపురం చేస్తూ మీ జీవితాన్ని సగం పంచుకుంటాను." ఆమె మాటలు పూర్తయ్యేటప్పటికి ఆమె చేయి అతని చేతిలో నలుగుతున్నది. గోవిందరావుకు ఎవరిని ప్రేమించాలో ఎలా ప్రేమించాలో తెలియక ఎవరినీ ప్రేమించలేకపోయాడు. అలాంటి ఓ అందమైన యువతి నిన్ను ప్రేమించాను అంటుంటే కలో నిజమో తెలియక తబ్బిబ్బవుతున్నాడు. కల కరిగి పోకూడదని తెగ ఆరాటపడుతున్నాడు.

ఆమె మరింత దగ్గరైంది. చీకటి దుప్పటి వాళ్ళిద్దరిని పూర్తిగా కప్పేసింది. ఆమె నడుం చుట్టూ చేతులేసి దగ్గరకు లాక్కుని నుదుటిమీద గాఢంగా చుంబిస్తూ "నేను మిమ్మల్ని గమనిస్తూనే వున్నాను. "ఐ లవ్ యూ" అన్నాడు. ఆమె పులకరించిపోతూ అతన్ని హత్తుకుపోయింది. చీకటి దుప్పటి చాటున ఎవరికీ కనిపించమనే ధీమాగా వున్నారు. గోవిందరావు నరాల్లో తీయని బాధ మొదలైంది. అతని వెచ్చని ఊపిరితో ఆమె నిలువెల్లా కరిగిపోవాలని ఆరాటపడుతోంది. ఆమె చేతులు లతలా అతన్ని చుట్టుకు పోతున్నాయి. గోవిందరావు ఆమెను ఏదో చేయాలని ఆరాటం తపన.



ఒకరిలో ఒకరు కలిసిపోవాలని బలమైన కోరిక వారిలో బుసలు కొడుతుంది.

సరిగ్గా అదే సమయంలో వచ్చాడు సెక్షన్ ఆఫీసర్ సింహం. ఆయన పేరు నరసింహం కానీ అందరూ ముద్దుగా సింహం అంటారు. అలా పిలిస్తేనే ఆయనకు ఆనందం. వస్తూనే "గోవిందరావ్!" పిలిచినా పలుక లేదు. భుజం పట్టుకుని కుదిపాడు. గోవిందరావ్ మొహం నిండా చెమటలు కంగారు, భయం ఉలిక్కిపడి కుర్చీలో నుండి లేచి కూర్చున్నాడు. ఎదురుగా సింహం నిలబడి వున్నాడు. కల కరిగి, కల అని తెలుసుకోవటాని కి రెండంటే రెండు క్షణాలు పట్టింది.

తేలుకుట్టిన దొంగలా ఫీలయ్యాడు.

"ఏమిటి గోవిందరావ్! ఆఫీసులో పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం కుర్చీలో వెనక్కివాలి, నోరు తెరుచుకొని మరీ కలలు కంటున్నావ్! నోటిలోనికి ఈగలు పోతే ఆరోగ్యం పాడవుదూ!" అంటూ ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు సింహం.

గోవిందరావు ఏమి మాట్లాడలేక కుర్చీలో కూర్చుని వంకర్లు తిరిగిపోయాడు. బంగారం లాంటి కల, కొంచెం ఆగి వస్తే ఏ సొమ్మేం పోయింది. ఇలాంటి ఛాన్స్ ఎంత ప్రయత్నించినా రాదు. కసిగా అనుకున్నాడు మనసులో.

"నీ సిగ్గు నాకర్థం అయిందిలే. ఈ మధ్య నువ్వు బాగా టిఫిన్లు తింటున్నట్లున్నావ్!" చిద్విలాసంగా నవ్వి అడిగాడు సింహం.

"టిఫిన్లా" నోరెళ్ళబెట్టాడు గోవిందరావు.

"చేయడం లేదా? మంచి వయసులో వున్నావు. టిఫిన్లు చేయకుండా ఎలావుంటావ్!"

"అందులో విశేషమేముంది. నేను రోజూ చేస్తూనే వున్నాను కదా!"

"ఆ టిఫిన్లు సంగతి సరే! పెళ్ళి చూపుల పేరిట తినే టిఫిన్ల సంగతి నేను అడుగుతున్నది" పెళ్ళి సంగతి తీయగానే మళ్ళీ వంకర్లు తిరిగిపోయాడు గోవిందరావు.

"ఇదిగో నీవలా వంకర్లు తిరగడం చూస్తుంటే నేను చేసిన టిఫిన్లు గుర్తుకొస్తున్నాయ్! నీలాగే ఒకసారి నేను పెళ్ళిచూపులకని వెళ్ళాను" మొదలెట్టాడు సింహం.

అందరు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఎందుకంటే ఎవరి మొహం వారికి కనిపించదు కనుక (జోక్). అందరూ గోవిందరావు మీద జాలిపడ్డారు. కళ్ళతోనే తమ ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. సింహం ఘోరంగా గోవిందరావును చితక్కొడుతుంటే పాపం ఆ బెండరు తలబాదుకున్నాడు. గోవిందరావు వయసు ఓ పాతిక సంవత్సరాలు దాటి ముసలి రూపు వచ్చినట్లు ఫీలవుతున్నారు (సినిమాలలో క్యాలెండరు మార్చి కాలం సరిగెదుతున్నట్లు చూపించినట్లు) సింహం మాత్రం ఓ గంటన్నర చితక్కొట్టి, తేలిగ్గా వూపిరి పీల్చుకొని, గుండె బరువు దింపుకున్నట్లు ఫీలవుతూ వెళ్ళిపోయాడు. గోవిందరావు నీరసంగా టేబుల్‌మీద ఒరిగిపోయాడు.

గోవిందరావు పెళ్ళి కుదిరింది. అప్పటినుండి అతనికి కష్టాలు ప్రారంభం అయ్యాయి. గోవిందరావు

పెళ్ళిరోజు తలుచుకుంటే ముచ్చెమటలు పడుతున్నాయి. ఇక ఆ తరువాత కార్యక్రమం గుర్తుకొచ్చేటప్పటికి ఒళ్ళు వణికిపోయింది. ఈ సంగతి బయటకు చెప్పుకోలేదు. అలా అని లోపల దాచుకుని భరించలేడు. కొలీగ్స్ అందరూ ఆట పట్టిస్తున్నారు.

అతని పరిస్థితి అందరికీ అర్థం అయిపోయింది. ఇక వుండబట్టలేక క్లోజ్ ఫ్రెండ్ కుమార్‌ని అడిగేశాడు. అతను సాయంత్రం ఓ పెద్ద హోటల్‌కు తీసుకెళ్ళి ఫుల్‌గా టిఫిన్ లాగించి బిల్ గోవిందరావు నెత్తిన రుద్ది ఓ గంట వివరించి మరీ చెప్పాడు. కుమార్ ఎంతసేపు చెప్పినా గోవిందరావుకి రుచించలేదు. అతనికి కావలసిన పాయింట్ దొరకలేదు. విచారంగా మొహం పెట్టి ఇంటికి బయలుదేరాడు. ఆ రాత్రికి అతనికి నిద్రకరువైపోయింది.

గోవిందరావు చిన్నప్పుడే తండ్రిపోతే తల్లి అతన్ని పెంచి పెద్దవాణ్ణి చేసింది. అతనికి క్లోజ్‌గా వుండే ఫ్రెండ్స్ కూడా లేరు. ఇలాంటి విషయాల గురించి చెప్పగా వినలేదు. అలవాటు నలుగురిలో తిరిగే అలవాటు లేదు. కనీసం పత్రికలు చదివే అలవాటు లేదు. అతనికి తాను యింతకాలం కోల్పోయిన విషయాలు యిప్పుడు కానీ అర్థం కాలేదు.

ఇలాకాదు అనుకుని ధైర్యం చేసి సెక్స్ డాక్టర్ని కలిసి సందేహం నివృత్తిచేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. హాస్పటల్ దగ్గరకెళ్ళాడు. కానీ లోపలకు వెళ్ళటానికి ఎవరైనా చూస్తారేమోనని భయం. చీకటి పడేవరకు రోడ్డుమీద ఆగి ఎవరూ తనని గమనించడం లేదని నిర్ధారించుకుని గబుక్కున లోపలకు దూరి గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు. అంతలో ఓ నర్స్ ఎదురైంది గోవిందరావుకు. ఆమె అతన్ని నఖశిఖ పర్యంతం పరికిస్తుంటే బట్టలిప్పి చూస్తున్నట్లు ఫీలయ్యాడు. సిగ్గుతో ముడుచుకుపోయాడు.

"రండి. ఇలా కూర్చోండి! అంది."

గోవిందరావు మంత్ర ముగ్ధుడిలా వెళ్ళి ఆమె చెప్పిన చోట కూర్చున్నాడు.

"చెప్పండి. ఏమిటి జబ్బు. ఎన్ని రోజులైంది తగిలుకుని" మామూలుగా అడిగింది. నర్స్ అలా అడుగుతుందని వూహించని గోవిందరావు దిగులుగా ఆమెవైపు చూశాడు.

"నేను డాక్టర్‌తోనే మాట్లాడతాను" అన్నాడు భయంగా.

"అక్కడయినా నేనే చూస్తాను. అయితే ఓ వంద ఫీజు యివ్వండి" అంటూ అతను యివ్వకుండానే బిల్ చింపి అతని చేతిలో కుక్కింది.

వందరూపాయలా అనుకుంటూ తప్పదనుకుని తీసి అందించాడు.

ఇంటర్‌కంలో డాక్టర్‌తో మాట్లాడి 'లోపలకెళ్ళండి' అన్నది నర్స్.


తడబడే అడుగుల్ని నిగ్రహించుకుని లోపలగదిలోనికి అడుగు పెట్టాడు. ఎదురుగా డాక్టర్ కూర్చుని వున్నాడు. ఎ.సి. గది చాల హాయిగా అనిపించింది.

"రా... బట్టలిప్పు..." అన్నాడు డాక్టర్. గోవిందరావు గుండె జారిపోయింది.

"మీ నర్స్ లోపలకు వస్తుందేమో! రావద్దని చెప్పండి" సిగ్గుతో గోవిందరావు. గొంతు కీచుమంది. డాక్టర్ నవ్వి ఇంటర్‌కంలో నర్స్‌ను రావద్దని చెప్పాడు.

"ఇక విప్పు" అన్నాడు విలన్‌లా.

"నాకే జబ్బు లేదండి. అసలు విషయం ఏమిటంటే......" గోవిందరావు పూర్తిగా వివరించాడు తన గోడును, అవస్థను, అసమర్థతను. డాక్టర్ విలన్‌లా ఓ చూపు చూసి, ఓ నవ్వునవ్వాడు. ఆ చూపులో ఎన్ని అనుమానాలు గోచరించాయే మన గోవిందరావుకు! ఆ నవ్వులో చేతకాని దద్దమ్మ, పనికిరాని వెధవ అన్న అర్థాలు కనిపించాయి. గుండె గతుక్కుమంది. ఏమైతే అయిందిలే అనుకున్నాడు కొంచెం ధైర్యం చేసి.




ఓ పావుగంట అర్థం కాని విషయాలు చెప్పి, సన పెట్టి, భరించలేక తలనొప్పి వచ్చిన తరువాత నాలుగు బూతు పుస్తకాలు చేతికిచ్చి మరీ పంపాడు డాక్టర్.

బ్రతుకు జీవుడా అనుకుని గుండెలనిండా గాలి పీల్చుకుని బయటకొచ్చి పడ్డాడు. అంతే! ఎదురుగా బస్టాప్‌లో గోవిందరావుని గమనించనే గమనించింది ఆఫీస్ కొలీగ్ సుందరి. గోవిందరావు వార్త ఫ్లాష్ న్యూస్ అయింది. ఆఫీసులో అందరి చర్చా గోవిందరావు గురించే.

"ఏమి లేదు గురూ! అనుభవం కోసం ఎక్కడో మన గోవిందరావు కాస్త ఎంగిలిపడ్డాడు. ఏ సుఖరోగమో అంటుకుని వుంటుంది. అంతే! అందులో తప్పేముంది." అతనికి వినపడేటట్లు కామెంట్ చేస్తుంటే మనసులోనే ఏడ్చాడు. ఈ విషయం బయటపడి కాబోయే భార్య చెవిన పడితే ఏమైనా వుందా అనుకుని ఒణికిపోయాడు.

దిక్కుమాలిన అనుభవం కావలనుకుంటే నన్ను అడగవచ్చు కదా! ఎవరూ లేకుండా చూసి మొహానే అడిగేసింది సుందరి ఒళ్ళు విరుచుకుంటూ. చేతులెత్తి నమస్కరించాడు గోవిందరావు. లేదు, కాదు అని ఎంత మొత్తుకున్నా ఎవరూ నమ్మలేదు. అబద్ధానికి నిజం కన్నా గొప్ప విలువ వుంటుంది కాబోలు అనుకున్నాడు గోవిందరావు ఏమిచేయలేక.

అతను భయపడిన కొలదీ మరింత హేళన చేశారు. భయపడ్డాడు, బాధపడ్డాడు, దిగులుపడ్డాడు, చిక్కిపోయాడు. ఎంత కలత చెందినా, గాభరా పడినా,

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో బిందు పబ్లికేషన్స్ నూతన నవలలు ఆగష్టు 15 విడుదల!

మీ అభిమాన రచయిత్రి కుమారి వింజమూరి విజయశాంభవి
సస్పెన్స్, హర్రర్ మేళవించి అందించిన మరో అద్భుత రచన
క్షుద్రయాగం వెల: రూ. 34/-

సైకలాజికల్ థ్రిల్లర్ రక్తగులాబీలు అను నవలద్వారా తన ప్రత్యేకత నిరూపించుకున్న యువ రచయిత
వర్ధినేని శ్రీనివాసులు
మరో అద్భుత సృష్టి
రణనినాదం వెల: రూ. 26/-

★ త్వరలో విడుదల!
ఫాలాక్షుడు చేనేపల్లి నరసింహారెడ్డి
మగబుద్ధి మల్లాపాక మురళి
కౌగిట్లో శత్రువు వింజమూరి విజయశాంభవి

★ నేడే అడ్వాన్సుతో ఆర్డరు పంపండి!
బిందు పబ్లికేషన్స్
15/80, బృందావనం
నెల్లూరు - 524 001

ఆందోళన చెందినా పెట్టిన ముహూర్తానికే గోవిందరావు పెళ్ళి జరిగిపోయింది. ఆ తరువాత శోభనం కూడ జరిగిపోయింది.

ఓ వారం రోజులు గోవిందరావు మీద చర్చలు దీర్ఘంగా జరిగాయి. ఎవరికి తోచినట్లు వాళ్ళు వూహించుకున్నారు. మొత్తానికి వైవాహిక జీవితం అంటే ఏమిటో తెలియని గోవిందరావు ఫెయిల్ అయ్యాడో లేక సక్సెస్ అయ్యాడో తెలుసుకోవాలని అతని రాకకోసమై ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురుచూస్తున్నారు.

అందరూ ఆఫీసుకు పదిన్నరకు పదినిముషాలు ముందుగానే వచ్చి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరో పావుగంటకు గాని వచ్చాడు గోవిందరావు. అతను కొంచెం ఒళ్ళుచేసి అందంగా, ఆనందంగా కనిపించాడు. అతని చేతిలోని స్వీట్‌పాకెట్ మీద దాడిచేయబోతుంటే వారించి రిజిస్టర్‌లో సంతకం చేసి, బాస్‌ను కూడా బయటకు పిలిచి అందరికీ స్వీట్లు అందించాడు.

"గోవిందరావ్! దయచేసి నీ ఫస్ట్‌నైట్ గురించి వివరించవలసిందిగా కోరుతున్నాం" ముక్తకంఠంతో అడిగారు. గోవిందరావు అందరి ముఖాలలోనికి తొంగిచూశాడు. అందరికీ టెన్షన్‌గావుంది.

"వెల్. మీరు అడుగకపోయినా నేనే చెబుదామనుకున్నాను. నీవు అక్షరాలు నేర్చుకోవటానికి ఎంత కాలం పట్టింది కుమార్?" గోవిందరావ్ ప్రశ్న.

"ఓ సంవత్సరం పట్టి వుండవచ్చు" చెప్పాడు కుమార్ మామూలుగా.

"సుందరి నీవు టైప్ నేర్చుకోవటానికి ఎంత కాలం పట్టింది?"

"ఆరు నెలలు పట్టింది" వయ్యారంగా చెప్పిందామె.

"వెల్. ఎవరైనా చెప్పి చేసి చూపిస్తేనే కదా నేర్చుకున్నావ్!"

"యస్!" అన్నది స్టయిల్‌గా.

"కాబట్టి. మనిషి ఏ పనినైనా నేర్చుకోవాలన్నా, దాని గురించి తెలుసుకోవాలన్నా, ఎవరైనా దగ్గరుండి నేర్పాలి లేదా వివరంగా చెప్పాలి. అదీ కాకుంటే చేసి చూపించాలి. కానీ ఈ ఫస్ట్‌నైట్ వుంది చూశారూ! అది ఎవరూ చెప్పకపోయినా, నేర్పకపోయినా, కనీసం చేసి చూపించకపోయినా మనిషి తనకుతానుగా నేర్చుకునేది యిదేనని, నేను అనుభవంతో నేర్చుకున్న విద్య అని సవినయంగా మనవిచేస్తున్నాను" వివరించాడు గోవిందరావు.

అందరూ చప్పట్లుకొట్టారు. ఆనందంతో, ఈర్ష్యతో, ద్వేషంతో.

సింహం నోరుతెరవబోయాడు ఏదో చెప్పాలని. కాని గోవిందరావు అతనికి ఛాన్స్ యివ్వకుండా బాక్స్‌లో మిగిలిన స్వీట్ అతని నోటిలో కుక్కాడు మాట బయటకు రాకుండా.

# పెద్దలకు మాత్రమే

## ప్రేమ ఎంత కఠినం!

"మా అమ్మా నాన్నల కంటే ఎక్కువగా నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానండీ... ఆ దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నానండీ..." అని ప్రతిరోజు నేను మా ఆయనతో చెబుతాను చెప్పింది సులక్షణ. తన స్నేహితురాలితో!

"అంటే, నీవు మీ ఆయన్ని నిజంగా, అంత గాఢంగా ప్రేమించడం లేదా? అడిగింది భారతి... అనుమానంగా!

"లేదు! ముమ్మాటికీ లేదు!!" చెప్పింది సులక్షణ నిక్కచ్చిగా!

"మరి, ఎందుకలా అబద్ధం చెప్తావ్ ఆయనతో?" ఆశ్చర్యంగా మొహం పెట్టింది భారతి!

"అల్లా చెప్తేనే ఈ మగాళ్ళు ఇంటి పనుల్లో సహాయం చేస్తారు. లేకపోతే తమకేం పట్టనట్లు మగరాయుళ్లలా ప్రవర్తిస్తుంటారు."

## అమ్మాయిల నమ్మకం!

"అమ్మాయిలు అబ్బాయిలని 'నమ్మొద్దు' అని అనుకుంటారు.

"కాని...?"

"కాని గత్యంతరం లేక నమ్మేస్తారు."

"అపుడేమవుతారు?"

'మోసపోతుంటారు!"

## బట్టలు వేసుకోలేదు!

అమెరికా నగరానికి ఒక భారతీయ కుటుంబం వలసపోయింది.

ఒకరోజు!

మధ్యాహ్నం స్కూలు నుంచి ఇంటికొచ్చిన అయిదేళ్ళ రాణి బీచ్‌కెళ్ళింది... ఆడుకోడానికి! సాయంత్రం వరకు బీచ్‌లో ఆడుకుని ఇంటికి వచ్చింది. బట్టలు చించుకుని, ఒంటికంతా మురికి అంటించుకుని!

"ఏమిటే అది? అలా తయ్యారయ్యావు. నీ వాలకం ఇలా ఎవరు చేశారు?" రాణి తల్లి అడిగింది... కోపంగా!

నేను నా స్నేహితులు కలిసి బీచ్‌లో ఆడుకున్నాము అమ్మా. అందుకే అలా అయ్యాను" చెప్పింది రాణి... అమాయకంగా!

"ఎవరే ఆ స్నేహితులు? ఆడపిల్లలా? మగపిల్లలా?" అడిగింది తల్లి... అనుమానంగా!

"ఏమో అమ్మా! నాకేం తెలుసు? వాళ్ళు బట్టలు వేసుకోలేదు కదా!" చెప్పింది రాణి!

తల్లి కుర్చీలా బిగుసుకుపోయింది.

## ఫూలయ్యావు!

"మా ఆయన స్త్రీతో కలిసి వున్నపుడు నేను ఆయన్ని రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నాను" చెప్పింది లీలావతి... తారామతితో వుత్సాహంగా!

"ఎవర్తితో వున్నపుడు?"

నాతోనే వున్నప్పుడు! జస్ట్ నిన్ను ఫూల్‌ని చేయాలని అలా చెప్పాను. అంతే!"

## రైటా — రాంగా?

మా పక్కింట్లోకి కొత్తగా పెళ్ళయిన ఓ జంట కాపురానికి వచ్చింది. వచ్చినప్పట్నుంచీ వాళ్ళు ఏదో ఒక విషయమ్మీద తగువులాడుకుంటూ వున్నారు. వాళ్ళ తగువు తీర్చాలని అనుకుని ఒక రోజు వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఆ సమయంలోనూ వాళ్ళు తగువులాడుతూనే వున్నారు.

"చూడండి! ఇలా రోజు తగువులాడుతుంటే మీరు సంసారం ఎపుడు చేస్తారు? నన్ను మా ఆవిడ్ని చూడండి. ఎప్పుడైనా తగువులాడుతూ కనిపించామా" అంటూ అడిగాను ... ఎలాంటి పరిచయాలు చేసుకోకుండానే!



"మీరిద్దరూ ఏ విషయమ్మీద తగువులాడుకోరా?" అడిగారా దంపతులు ఒక్కసారిగా... అపనమ్మకంతో!

"అవును! చిన్న చిన్న విషయాలు మా ఆవిడ చూసుకుంటుంది. పెద్ద పెద్ద సమస్యలు నేను చూసుకుంటా. ఇక తగువులెలా వస్తాయి?" అడిగాను నేను... ప్రశ్నార్థకంగా.

"చిన్న విషయాలంటే?" అడిగిందావిడ... ఆశ్చర్యంగా...!

"చిన్న విషయాలంటే, ఇంటి ఖర్చులు, సినిమాలు, బట్టలు, పండుగలు పిండివంటలు, చుట్టాల ఖర్చులు వగైరా వగైరా... చెప్పాను నేను.

"మరి పెద్ద పెద్ద సమస్యలంటే?" అడిగాడాయన...వుత్సాహంగా!

"పెద్ద విషయాలంటే ఏ పార్టీకి ఓటు వేయాలి? రిజర్వేషన్ల సమస్య ఎలా తీర్చాలి?... మందిర్ కట్టాలా?.. మస్జిద్ కట్టాలా?.. పంజాబ్, అస్సాం వగైరా వగైరా సమస్యలు!"

నిర్వహణ:

చింతల లక్ష్మణ్ ముదిరాజ్